క్లుప్తంగా

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రానాయక్, కోశాధికారి కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, పెన్షన్ బకాయిలు చెల్లించడంలేదని దీంతో ఉద్యోగులు, పెన్షనర్ల అయోమయంలో ఉన్నారని తెలిపారు. పెండింగ్‌లోఉన్న 5 కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని మంచి ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

టీబీ నిర్ధారణకు పరీక్షలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం టీబీ నిర్ధారణ కోసం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతాప్ చౌహన్ ఆధ్వర్యంలో సీవై–టీబీ చర్మ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన పరీక్షల సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. టీబీ నిర్ధారించేందుకు చర్మపరీక్షలు చేశామని తెలిపారు. టీబీ లక్షణాలున్న వారికి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సిబ్బందికి సీవై–టీబీ నిర్ధారణ కిట్లను పంపిణీ చేశామని తెలిపారు.

గ్రంథాలయాలతో వికాసం

గండేడ్: గ్రంథాలయాలతో విద్యార్థుల్లో వికాసం పెంపొందుతుందని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలతో విద్యార్థుల్లో ఎనలేని జ్ఞానం సమకూరుతుందన్నారు. కొందరు బొమ్మలు చిత్రాల ద్వారా పఠనాసక్తిని పెంపొందించుకుంటారన్నారు. మరికొందరు పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకుటారన్నారు. పాఠశాలలో ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు

జడ్చర్ల: స్థానిక పాతబస్టాండ్ వైపు నుంచి సిగ్నల్‌గడ్డ వైపు వస్తున్న రెండు బైక్‌లు అతివేగంగా ఢీ కొనడంతో నలుగురు యువకులు గాయపడ్డారు. వీరిలో ఇ ద్దరి పరిస్థితి విశమంగా ఉండడంతో 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు స్థానిక నల్లకుంటలో నివాసముంటున్న సన్ని, ఆలూరుకు చెందిన శివగా గుర్తించారు. మరో ఇద్దరు యువకులకు పాక్షికంగా దెబ్బలు తగలడంతో స్థానిక ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

మహమ్మదాబాద్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు వర్షాల నుంచి ఎలాంటి ప్రమాదం జరుగకుండా తగిన జాగ్రత్తలు వహించాలని తెలిపారు. పాతబడ్డ ఇళ్లల్లో ఉండకుండా తెలిసిన వారి ఇళ్లల్లో ఉండాలని సూచించారు.

చైర్‌పర్సన్ వర్సెస్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

జడ్చర్ల: మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గురువారం కావేరమ్మపేటలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ లక్ష్మారెడ్డిని వారు కలిశారు. తమ వార్డుల్లో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పర్యటించడం ఏమిటని వారు ప్రశ్నించారు. వర్షా కాలంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు తమకు నేరుగా ఫోన్లు చేస్తుండడంతో తాము సంబంధిత కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చే వెళుతున్నామని చైర్‌పర్సన్ సమాధానమిచ్చారు. అయితే కొందరి ఫోన్లు బిజీ రావడం, ఎత్తకపోవడంతో ఆలోగా తాము వార్డులకు చేరుకుంటున్నామని మరే ఇతర ఉద్దేశంలేదన్నారు. వార్డులకు వచ్చేముందు ప్రోటోకాల్ పాటించాలని.. లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు హెచ్చరించారు. అంతేగాక తమకు కనీస సమాచారం ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఎలా చేరుతారని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఇలా చేసే వారైతే తాము ఎన్నుకునే వారమే కాదన్నారు. దీంతో చైర్‌పర్సన్ తరఫున ఒకరు ఆగ్రహించి తాము ఖర్చు చేసిన మొత్తాన్ని వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేయడంతో వాగ్వాదం ముదిరింది. దీంతో అక్కడే ఉన్న కొందరు ఇరువురిని శాంతపర్చడంతో వివాదం సద్దుమనిగింది.

ఆర్థిక సాయం అందజేత

కోయిల్‌కొండ: మండల కేంద్రానికి చెందిన మంగళిశ్రీను అనారోగ్యంతో మృతిచెందడంతో ఇబ్రహీంనగర్ గ్రామస్తులు ఆయన అంత్యక్రియల కోసం రూ.25వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. 40ఏళ్లుగా ఇబ్రహీంనగర్‌లో వృత్తిలో భాగంగా మంగళి పనిచేసేవాడని దానిలో భాగంగా గ్రామస్తులంతా పోగుచేసి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

రోజంతా ముసురు

- జిల్లా కేంద్రంలో చిరుజల్లులతో తడిసిన ప్రజలు
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు
- అరబ్‌గల్లీలో కూలిన డ్రైనేజీ దిమ్మెలు



అరబ్‌గల్లీలో కూలిన డ్రైనేజీ దిమ్మెలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది



హనుమాన్‌పురా వద్ద ఇసుక మేటలను పక్కకు వేస్తున్న మున్సిపల్ కార్మికులు



శ్రీకృష్ణాకాలనీ వద్ద ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో రెండు, మూడు రోజులుగా అర్ధరాత్రి వేళ ఓ మోస్తరు వర్షం కురియగా.. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ముసురు అలుముకుంది. అక్కడక్కడా డ్రెయినేజీలు నిండి పొంగి పొర్లాయి. ఎన్‌హెచ్‌– 167పై రాయచూర్ రోడ్డుపై పలుచోట్ల ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఆదర్శనగర్‌లోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారి (శ్రీకృష్ణాకాలనీ) లో డ్రెయినేజీ సౌకర్యం సరిగా లేకపోవడంతో పైనుంచి వచ్చిన వరద కాస్తా పాయగా మారింది. మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతంలో కాల్వను తవ్వి ముందుకు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇక అరబ్‌గల్లీలో ఇటీవలే సీసీరోడ్డు నిర్మించారు. అయితే ఈ వర్షాలకు పక్కనున్న డ్రెయినేజీ దిమ్మెలు 50 మీటర్ల మేర కూలిపోయాయి. విషయం తెలుసుకున్న వారు అక్కడికి వెళ్లి జేసీబీతో వాటిని పక్కకు వేయించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న చిరు జల్లులతో దీంతో పాదచారులు, వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్య కూడళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాలను నెమ్మదిగా నడిపారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు తమ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేశారు.

కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్ ప్లాట్‌ఫామ్



కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్ ముందు ప్లాట్‌ఫామ్

జడ్చర్ల: మండలంలోని లింగంపేట శివారులో దుందుబీ వాగుపై చెక్‌డ్యామ్ ప్లాట్ ఫామ్‌లో కొంత భాగం బుధవారం కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరదతో చెక్‌డ్యామ్ నిండుగా పారుతుంది. జల వేగం ఉధృతం కావడంతో చెక్‌డ్యామ్‌పై నుంచి దిగువకు ప్రవాహ వేగం ఊపందుకుంది.అ యితే ఈ క్రమంలో చెక్‌డ్యామ్‌కు ముందు భాగంలో రక్షణగా నిర్మించిన ప్లాట్‌ఫామ్ కొంతభాగం వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. దీంతో చెక్‌డ్యామ్‌కు నష్టం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. చెక్‌డ్యామ్ ఏమాత్రం తెగినా దిగువ ప్రాంతంలో ఉన్న పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చెక్‌డ్యామ్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసున్నారు. కాగా చెక్‌డ్యామ్‌ను సందర్శించి సమస్యను పరిశీలించామని నీటిపారుదల శాఖ ఏఈ నరేశ్ తెలిపారు. ప్లాట్‌ఫామ్ పాక్షికంగా దెబ్బతిందని, నీటి ఉధృతి ఆగిన తర్వాత చర్యలు చేపడుతామని తెలిపారు.

ప్రయాణికుడికి ల్యాప్‌టాప్, బ్యాగు అప్పగింత



ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న స్టేషన్ మేనేజర్, సిబ్బంది

జడ్చర్ల టౌన్: బస్సులో మిస్సయిన ల్యాప్‌టాప్, డాక్యుమెంట్లతో కూడిన బ్యాగును ప్యాసింజర్‌కు జడ్చర్ల బస్టాండ్ స్టేషన్ మేనేజర్ రవీంద్రనాథ్ అప్పగించారు. గురువారం జరిగిన ఘటన వివరాలిలా.. రాయిచూరు మండలం సిర్‌వార్‌కు చెందిన కోటేశ్వరరావు హైదరాబాద్ వెళ్లేందుకు రాయచూర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. బస్సు మహబూబ్‌నగర్ చేరుకోగా అక్కడ కిందకు దిగాడు. కొద్దిసేపటికి బస్సు హైదరాబాద్ తిరిగి బయలుదేరింది. అయితే కోటేశ్వరరావు మాత్రం మహబూబ్‌నగర్ బస్టాండ్ లోనే ఉండిపోయాడు. కొద్దిసేపటికి బస్సు మిస్సయ్యాడని తెలుసుకుని అందులో విలువైన డాక్యుమెంట్లతో కూడిన బ్యాగు, ల్యాప్‌టాప్ ఉందని బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ గార్డ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రయాణికుడి వద్ద ఉన్న టికెట్ ఆధారంగా బస్సు నెంబరును గుర్తించి కండక్టర్‌కు సమాచారం ఇచ్చారు. బస్సులో బ్యాగు వివరాలు తెలియజేయడంతో దానిని జడ్చర్ల బస్టాండ్‌లో స్టేషన్ మేనేజర్‌కు అప్పగించారు. విషయాన్ని మహబూబ్‌నగర్ బస్టాండ్ స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. దీంతో సదరు ప్రయాణికుడిని జడ్చర్ల బస్టాండ్‌కు పంపించారు. బస్టాండ్‌కు చేరుకున్న ప్యాసింజర్‌ను వివరాలు తెలుసుకుని లాప్‌టాప్, బ్యాగును అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌గైడ్స్ శివరాముడు, వెంకటయ్య, ఆర్టీసీ సెక్యూరిటీ నర్సింహులు ఉన్నారు.

ప్రజా ప్రభుత్వంలో దశలవారీగా అభివృద్ధి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజాప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన హయాంలో అండర్ డ్రెయినేజీ కోసం నిధులు రూ.250 కోట్లు తెచ్చిన, మన్యంకొండ వద్ద రోప్‌వేకు టెండర్లు అయ్యాయని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో జేఎన్‌టీయూ వచ్చిందని హడావిడి చేశారని, మరి ఆ జీవో ఎక్కడుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పీయూకు లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరయ్యాయని, యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. మాజీ మంత్రి హయాంలో కేవలం శిలాఫలాలకే పరిమితమయ్యారని విమర్శించారు. మాజీ మంత్రి సలహాలు, సూచనలు మా ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. ఎన్‌పీ.వెంకటేశ్ మాట్లాడుతూ.. బీసీల గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రికి లేదన్నారు. వైఎస్ఆర్ హయాంలో 34 శాతం బీసీ రిజర్వేషన్లు ఉంటే కేసీఆర్ వచ్చిన తర్వాత 23 శాతం చేసినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాజీ మంత్రి రాజకీయ లబ్ధికోసం మాట్లాడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అజ్మత్‌అలీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలి



మహమ్మదాబాద్: సైబర్‌నేరాలు, మత్తుపదార్థాలపై తగిన జాగ్రత్త వహించాలని పోలీసు కళాబృందం సభ్యులు రాములు, జగదీశ్ తెలిపారు. ఎస్సై జానకి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నంచర్ల ఉన్నతపాఠశాల ఆవరణలో సురక్ష పోలీసు కళాబృందం, ఆటాపాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ.. బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి, క్రమశిక్షణతో కృషి చేయడంతో ఉత్తమ భవిష్యత్ లభిస్తున్నదని తెలిపారు. సైబర్‌కు గురైతే 1930కు లేదా పోలీసు కంట్రోల్ రూముకు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసుబృందం సహదేవ్, ఆనంద్, కళాకారులు శివరాములు, బాల్‌రాజ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

చదరంగం కిట్ల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాలమూర్ ఎన్ఆర్ఐ ఫోరం చెస్ నెట్‌వర్క్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం చెస్ కిట్స్‌ను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కలిపి 164 చెస్ బోర్డులు, చెస్ పుస్తకాలను పాలమూర్ ఎన్నారై ఫోరం కన్వీనర్ మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్నారై ఫోరం వ్యవస్థాపకుడు రామిరెడ్డి, ఎంఈఓ బలరాం, చెస్ కోచ్ ఆనంద్‌బాబు, శివారెడ్డి, తిరుపతిరెడ్డి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



దేవరకద్రలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

జడ్చర్ల టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూపీఎస్‌సీ) పిలుపుమేరకు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ నర్సింగ్‌రావుకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో 12 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దశలవారి పోరాటంలో భాగంగా వినతిపత్రం అందజేశామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మన్యం, శ్రీనివాస్‌లు తెలియజేశారు. యూనియన్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నరేశ్, సీనియర్ నాయకులు శంకర్‌బాబు, శ్రీనివాస్‌ఆర్య, నజీర్, డీటీఎఫ్ నాయకులు తిమ్మప్ప పాల్గొన్నారు.

❖ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు దేవరకద్ర తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మిడ్జిల్ తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నా యకులు నర్సింహులు, వెంకయట్య, రమేశ్, జానకమ్మ, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, రవికుమార్ ఉన్నారు.

కులగణనలో లంబాడీలను బహిర్గతం చేయాలి

మిడ్జిల్: ఇటీవల నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభాను బహిర్గతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. లంబాడీల సమస్యలపై ఈనెల 31న హైదరాబద్‌లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి సమావేశానికి లంబాడీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనువాసులు, సీతారామ్, విజయ్, లక్ష్మన్, తిరుపతి, బాలయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



హన్వాడ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని డీపీఓ పార్థసారథి సూచించారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని కేజీబీవీ, ఎంజేపీ గురుకుల విద్యాలయాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్న విషయాలను తెలుసుకున్నారు. కిచెన్ షెడ్డు, స్టోర్ రూంను పరిశీలించారు. ఎంజేపీలో సరిపడా వాష్‌రూంలు లేవని విద్యార్థినులు వాపోయారు. అదనంగా మరిన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, ఎంఈవో గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి బీజేపీ సిద్ధం

గండేడ్: రానున్న స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని రాష్ట్ర నాయకులు రాములు, శ్రీనివాస్, మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సల్కర్‌పేట్‌లో మండలాధ్యక్షుడి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బరిలో దిగడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి నరహరి రెడ్డి, ఉపాధ్యక్షులు మల్కయ్య, భద్రేశ్వర్, బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

దేవరకద్ర: మహిళలు సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలంలో జరిగిన రాష్ట్ర మేదరి మహిళా విభాగం శిక్షణ తరగతుల్లో 33 జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొని తమ గళం వినిపించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని మేదరి సంఘం మహిళలు ఇప్పడిప్పుడే బయటకు వచ్చి తమ ఉనికిని చాటుకోవడం గొప్ప విషయమన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు గురువారం పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష వైద్యపక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షకాలంలో సీజన్‌లో వ్యాధులు ప్రభలకుండా విద్యార్థులు జాగ్రతలు పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శోభారాణి, ఏఎన్‌ఎం పద్మ, హాస్టల్ వార్డెన్ విజయైకుమార్ పలువురు ఉన్నారు.

మండపానికి నిధుల కేటాయింపుపై హర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పరిమళగిరిలోని పార్కు వద్ద కొత్తగా నిర్మించనున్న అయ్యప్ప స్వామి అన్నదాన మండపానికి ముడా నిధులు రూ.38 లక్షలు కేటాయించడంపై నిర్వాహకులు గురుస్వామి రఘుపతిశర్మ, గుండా మనోహర్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా ఇక్కడ అన్నదాన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో తొగుట వీరక్షత్రియ కుల బంధువులు గురువారం చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నైవేద్యాలతో స్థానిక రాంమందిర్ నుంచి వీరన్నపేటలోని చౌడేశ్వరి దేవి ఆలయం వరకు మేళాతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, అలంకరణ చేశారు. మహిళలు లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. అనంతరం సామూహికంగా ఉయ్యాల సేవ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కురుమూర్తి, బాలరాజు, బాలకిషన్, బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రూ.44 కోట్లతో వంతెనల నిర్మాణం

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలో రూ.44.10 కోట్లతో వంతెనల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాష్ట్ర పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి గతేడాది అందించిన ప్రతిపాదనలను దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జడ్చర్ల మండలంలోని నల్లకుంటతండా రోడ్డుపై వంతెనకు రూ.4.50 కోట్లు, ఎక్వాయపల్లి–లింగందన రోడ్డు బ్రిడ్జికి రూ.3కోట్లు, నెక్కొండ–బైరంపల్లి రోడ్డు బ్రిడ్జికి రూ.4.50 కోట్లు, కొండేడు–తుపుడగడ్డతండా బ్రిడ్జికి రూ.4.50 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. అదేవిధంగా బాలానగర్ మండలంలోని జాతీయ రహదారి నుంచి ఉడిత్యాల, మోతిఘన్‌పూర్, సూరారం మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, శేరిగూడ–బోడజానంపేట బ్రిడ్జికి రూ.6కోట్లు, నవాబ్‌పేట మండలంలోని వీరశట్పల్లి నుంచి దయాపంతులపల్లి మీదుగా హాజీపూర్ వెళ్లేమార్గంలో బ్రిడ్జి ఏర్పాటుకు రూ.2.40 కోట్లు, రాజాపూర్ మండలంలోని రాయపల్లి–కుచ్చర్‌కల్ రోడ్డు బ్రిడ్జికి రూ.6కోట్లు, మిడ్జిల్ మండలంలో వల్లభురావుపల్లి నుంచి చౌటకుంట తండా మీదుగా వేముల మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.20 కోట్లు చొప్పున మొత్తం 9వంతెనల నిర్మాణానికి రూ.44.10 కోట్లు మంజూరుకు ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఆయా బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



నవాబుపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పార్టీశ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. అనంతరం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు పాల్గొన్నారు.

❖ జడ్చర్ల పాతబజార్‌లోని గాంధీచౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్‌కట్ చేసి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సారిక, లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

❖ దేవరకద్రలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను మండల నాయకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను ఒకరికొకరు తినిపించుకుని నినాదాలు చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, పాషా, గౌస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

❖ అడ్డాకుల బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి మహిళలు, వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

❖ చిన్నచింతకుంట మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్ షెటర్లలో కేక్ కట్ చేసీ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోట రాము, నాయకులు పాల్గొన్నారు.

❖ మిడ్జిల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

❖ హన్వాడ మండలకేంద్రంలో కేక్‌కట్ చేసిన ఒకరినొకరు తినిపించుకుంటూ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

❖ కోయిల్‌కొండ మండల కేంద్రంలోని వివేకానందచౌరస్తాలో కేక్‌కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. విజయ్‌భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, రవి, శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లతో సమీక్షించారు. ఎల్‌–1 కింద 1,347 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు సుమారు 500 మంది లబ్ధిదారులు మాత్రమే పనులు ప్రారంభించడమేమిటని ప్రశ్నించారు. మిగతారు వారు వెంటనే చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. 35 శాతమే ఆస్తిపన్ను వసూలు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పేరుకుపోయిన మున్సిపల్ దుకాణాల అద్దె బకాయిలు వసూలయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



జిల్లా బాస్కెట్‌బాల్ జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరచి విజేతగా నిలవాలని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉత్తనూర్‌లో శుక్రవారం నుంచి 27 వరకు జరిగే అంతర్‌జిల్లా రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్లకు గురువారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టిగా ఆడితే టోర్నమెంట్‌ల విజయం సాధించవచ్చని అన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నసరుల్లా హైదర్, సుబాన్‌జీ, మీర్ ఖాలేద్‌అలీ, మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ, మహ్మద్ షకీల్, బాల్‌చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ బాలుర జట్టు: ఎస్.అదిత్‌నారాయణ్, కె.సంతోష్‌కుమార్, కె.రాజా రాంచరణ్, బి.భానుప్రకాశ్, కె.ద్రోణదత్తా, టి.వివేక్, షేక్ అబ్దుల్లా, మహ్మద్ రియాన్, ఎస్.రాంచరణ్, కె.అనిల్, వి.రోహిత్, పి.వసంత్.

బాలికల జట్టు: ఎస్.హర్షిత్, జి.చైత్ర, కె.సైనిక్త, జి.వైష్ణవి, జి.శ్రీజ, కె.పవిత్ర, ఎస్.రాజేశ్వరి, ఈ.దీక్ష, వి.చందన, కె.శ్రీజ, కె.జ్యోతి, ఎం.వైష్ణవి.